# ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 23 : ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో ఐదో తరగతితోపాటు 6, 7, 8, 9 తరగతుల్లోని మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 6,034 మందికి 5,912 మంది పరీక్ష రాశారు. కాగా.. ఆదిలాబాద్ పట్టణంలోని స్థానిక సోఫినగర్ కాలనీలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని గదులను తనిఖీ చేయగా.. వైద్య శిబిరాన్ని సందర్శించి మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**ఆదిలాబాద్ జిల్లాలో 4,017 మంది హాజరు..**

ఎదులాపురం, ఫిబ్రవరి 23 : ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు పరీక్ష కొనసాగింది. 4,198 మంది దరఖాస్తు చేసుకోగా.. పది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 181 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా.. 4,017 మంది పరీక్ష రాశారని డీసీవో లలిత కుమారి తెలిపారు.

# యువకుడి అరెస్టు

ఎదులాపురం, ఫిబ్రవరి 23 : వివాహితను న్యూడ్ వీడియోకాల్ చేసి బెదిరించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న వివాహితకు మెదక్ జిల్లా నర్సాపూర్ గ్రామనికి చెందిన నందుల ఆనంద్(19) విద్యార్థి వివాహితతో మొదటగా ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యాడు. అప్పుడప్పుడు వీడియోకాల్‌లో మాట్లాడేవాడు. అదే సమయంలో స్క్రీన్ షాట్ తీసుకునేవాడు. అ తరువాత తనను శారీరకంగా కలవాలని లేకపోతే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరించేవాడు. భయపడి వివాహిత వీడియోకాల్ చేయగా వాటిని స్క్రీన్ షాట్ తీసుకునేవాడు. భయపడి బాధితురాలు ఈ నెల 4వ తేదీన వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ పద్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడిని చాకచక్యంగా పిలిపించి పట్టణంలోని వినాయక్‌చౌక్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## సామాజిక రాజకీయ చైతన్యం ఆవశ్యకం



నూతన కార్యవర్గ సభ్యులతో అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్

ఎదులాపురం, ఫిబ్రవరి 23 : యాదవ కులస్తులు అన్నింటా వెనుకబడి ఉన్నారని, దీనికి సామాజిక, రాజకీయ చైతన్యం ఆవశ్యకమని అఖిల భారత యాదవ మహాసభ, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన జిల్లా యాదవ సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీసీలకు 56 శాతం రిజర్వేషన్ల అవసరం ఉందన్నారు. గొంగడి కళ, పల్లెల్లో పశు, మనుషుల వైద్యులుగా అన్నింటా యాదవులకు చరిత్ర ఉందని గుర్తు చేశారు. అంతకముందు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడిగా అసుర హన్మాండ్లు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మంచాల మల్లయ్య, కోశాధికారిగా సుధాకర్, మండలాల ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ అరిగెల నాగేశ్వరరావు, ప్రముఖ హోమియో వైద్యులు రవికిరణ్‌యాదవ్, సంఘ నాయకులు రాజు యాదవ్, విజయబాబు, ఆవుల రాఘవేంద్రనాథ్ యాదవ్, నారాయణ యాదవ్, ఆశన్న, మహేందర్ యాదవ్, భీమన్న యాదవ్, పండరి యాదవ్, లింగం, నవీన్, మంగరాపు రమేశ్ యాదవ్ వేణు, సతీష్, శ్రీనివాస్, కల్చాప్ యాదవ్, రమేశ్, ఉమేశ్ పాల్గొన్నారు.

## సాలేగూడకు మళ్లీ నీటి కష్టాలు



ఎడ్లబండ్లపై ట్యాంకులు, క్యాన్లను ఏర్పాటు చేసుకుని నీటి కోసం వచ్చిన ఆదివాసులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 23 : ఏజెన్సీ ప్రాంతమైన తేజాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సాలేగూడ గ్రామానికి చెందిన ఆదివాసులకు మళ్లీ నీటి కష్టాలు మొదలయ్యాయి. ఆదివాసులకు పీడిస్తున్న నీటి కష్టాలపై ఈనెల 15న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురించడంతో సంబంధిత శాఖలకు చెందిన అధికారులు ఈ నెల 17న ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి నీళ్లు అందిస్తున్నారు. కానీ.. గ్రామంలోని 130 కుటుంబాలకు చెందిన ఆదివాసులకు సరిపడా నీళ్లను అందించకపోవడంతో మళ్లీ నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎడ్లబండ్లపై ట్యాంకులు, క్యాన్లను ఏర్పాటు చేసి విద్యుత్ మోటర్ నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే దృష్టి సారించి తమ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని పేర్కొంటున్నారు. రోజు క్రమం తప్పకుండా గ్రామస్తులకు సరిపడా నీటిని అందించాలని సాలేగూడ ఆదివాసులు కోరుతున్నారు.

## చేనులో ఇసుక మేటలు



చేనులో ఇసుక మేటలను చూపిస్తున్న రైతులు

పెంబి, ఫిబ్రవరి 23 : రెండేండ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టు గేట్లు మొరాయించాయి. దీంతో బ్యాంక్ వాటర్ నిలిచి చేలలో ఇసుక మేటలు వేశాయి. దాదాపు పది మంది రైతులకు చెందిన 50 ఎకరాల్లో ఇసుక మేటలు పేరుకుపోయాయి. ఈ భూముల్లో మొక్కజొన్న, పత్తి, పసుపు, కందులు పండించేవారు. ఇసుక మేటలతో రెండేండ్ల నుంచి పంటలు పండించుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. హోరె రాముకు చెందిన 6, కాట్‌పల్లి శ్రీనివాస్‌కు చెందిన 4.2, అల్లోల గోవర్ధన్‌కు చెందిన 5, చంద్రశేఖర్‌కు చెందిన 10, సాయినాథ్‌కు చెందిన 20 ఎకరాల్లో ఇసుక మేటలు పెట్టాయి. ఇసుక తరలించుకుని అమ్ముకోవడానికి నెల రోజుల క్రితం రైతులు నిర్మల్ జిల్లా కేంద్రంలో గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు దరఖాస్తు పెట్టుకున్నారు. ఇప్పటివరకు ఆదేశాలు రావడంలేదని వాపోతున్నారు. భూముల్లో ఇసుక మేటలతో పంటలు పండించుకోలేక తీవ్రంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం స్పందించి చేనులో ఇసుకను తరలించుకోవడానికి అనుమతి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

# నిరుద్యోగులకు చేయూత



బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న యువత

- బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉద్యోగాలకు శిక్షణ
- బీఆర్ఎస్ హయాంలో రూ.3.30 కోట్లతో నిర్మాణం
- పలు ఉద్యోగాలకు యువత ఎంపిక

ఆదిలాబాద్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ) : నిరుద్యోగులకు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేసి, నిపుణులతో యువతకు కార్పొరేట్ స్థాయిలో శిక్షణను అందించడానికి చర్యలు తీసుకున్నది. దీంతో యువత వివిధ పోటీ పరీక్షల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఆదిలాబాద్‌లో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో రూ.3.30 కోట్లతో జీ ప్లస్ టూ భవనాన్ని నిర్మించి సకల సౌకర్యాలు కల్పించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సహకారం నిరుద్యోగులకు వరంగా మారింది. బీసీ స్టడీ సర్కిల్‌లో వివిధ పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు విద్యార్థులు చదవుకునేందుకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్స్, ఇతర వసతులు అందుబాటులో ఉన్నాయి.

**385 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ పొందిన నిరుద్యోగులు 385 మంది వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వీరితోపాటు 500 మందికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు పొందారు. స్టడీ సర్కిల్‌లో వివిధ పోటీ పరీక్షల్లో శిక్షణ ఇవ్వడానికి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. వివిధ సబ్జెక్టులకు చెందిన నిపుణులు శిక్షణ ఇస్తారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు లైబ్రరీ, స్టడీ హాళ్లు అందుబాటులో ఉంటాయి. క్లాస్, వీక్లీ ఎగ్జామ్స్, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తారు. ప్రస్తుతం 100 మంది విద్యార్థులకు ఆర్ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకింగ్ ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటున్నారు. నాలుగు నెలలపాటు ఈ శిక్షణ కొనసాగనుండగా నిరుగ్యోగులకు రోజు టీ, స్నాక్స్ అందిస్తున్నారు. శిక్షణ పొందుతున్న వారికి రోజు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**మెరుగైన శిక్షణ అందిస్తున్నాం..**



ఆదిలాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులకు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఉచితంగా మెరుగైన శిక్షణ అందిస్తున్నాం. వివిధ సబ్జెక్టుల్లో అనుభవం గల నిపుణులతో తరగతులు నిర్వహిస్తున్నాం. లైబ్రరీలో నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంటుంది. చదువుకోవడానికి ప్రశాంతమైన వాతావరణంతోపాటు స్టడీ హాళ్లు ఉన్నాయి. బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ నిరుద్యోగులకు ఉపయోగ పడుతుంది. పోటీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. ప్రస్తుతం ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగాల కోసం వంద మంది నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నాం. **- ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్, బీసీ స్టడీ సర్కిల్, ఆదిలాబాద్**



లైబ్రరీలో చదువుకుంటున్న నిరుద్యోగులు



స్టడీ హాల్‌లో ప్రిపేర్ అవుతున్న యువకులు

# మహనీయులు చూపిన మార్గంలో నడవాలి

**మాజీ మంత్రి జోగు రామన్న**



సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాల చేస్తున్న రామన్న

ఎదులాపురం, ఫిబ్రవరి 23 : మహనీయులు చూపిన మార్గంలో పయనిస్తూ మెరుగైన సమాజ నిర్మాణానికి పాటుపడాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పట్టణంలోని చిలకూరి లక్ష్మీనగర్‌లో ఆదివారం సంత్ రవిదాస్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. భక్తి, ఆధ్యాత్మికత వైపు ప్రజలను చైతన్యవంతులను చేయడంలో సంత్ రవిదాస్ కృషి చేశారన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్ ఇటుకరే, సంజయ్ గైక్వాడ్, సంతోష్ ఇంకరే, సంతోష్ గైక్వాడ్, దాదా రావు, డాక్టర్ అల్కా సంజయ్, చంద్ర ప్రకాశ్, మధు భవల్కర్, అశోక్ కాలే, రాజు, హేమంత్ , తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లికి నిరాకరిస్తున్నాడని హత్యాయత్నం



నిందితుడిని అరెస్టు చూపుతున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 23 : పెళ్లికి నిరాకరిస్తున్నాడని బాలిక తండ్రిపై హత్యాయ త్నం చేసిన బాలున్ని అరెస్టు చేసినట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేష్‌మీనా తెలిపారు. పోలీసుల వివరాల మేరకు నిర్మల్ పట్టణంలోని కొత్త కలెక్టర్ కార్యాలయం వద్ద డబుల్ బెడ్ రూం కాలనీలో నివసిస్తున్న ఓ యువతిని నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నాని పెళ్లి చేసుకుంటానని ఓ బాలుడు చెప్పగా ఆమె పెళ్లి వయస్సు వచ్చిన తర్వాత పెళ్లి చేసుకుంటానని చెప్పింది. ఈ విషయం బాలిక తండ్రి వద్దకు బాలుడు వెళ్లి చెప్పగా పెళ్లి వయస్సు వచ్చిన తర్వాత చేస్తానని చెప్పాడు. అతను ఉంటే తన పెళ్లి కాదని బాలిక తండ్రిపై కోపం పెంచుకుని మహ్మద్ తౌసిఫ్ ఉల్లా సహాయంతో శనివారం రాత్రి బాలిక ఇంటికి వెళ్లి బాలిక తండ్రి కడుపులో కత్తెరతో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య చికిత్స కొరకు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలునిపై అతనికి సహకరించిన మహ్మద్ తౌసిప్ ఉల్లా పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# దొంగల ముఠా అరెస్టు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 23 : జల్సాలకు అలవాటు పడి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మావల మండలంలోని దుర్గానగర్‌కు చెందిన నలుగురు యువకులు సుక్‌దేవ్ అలియస్ సన్నీ(25), రన్‌మల్లే గజానంద్ అలియస్ కరణ్(21), టేంబుల్‌కర్ కృష్ణ(20), బకాలే ఆకాశ్(19)లు ముఠాగా ఏర్పడి జల్సాలకు అలవాటు పడ్డారు. జిల్లాలో తరచుగా అక్కడక్కడ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 21న ఇంద్రవెల్లి మండలంలోని అశ్వర్‌నగర్‌కు చెందిన జైదుర్గ వైన్‌షాపుతోపాటు ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్డులో గల రెండు వైన్‌షాపులు, నార్నూర్ మండలంలోని రెండ కిరాణ షాపు, గాదిగూడ మండలంలోని లోకరి వైన్‌షాపులో ఒకే రాత్రి దొంగతనానికి పాల్పడ్డారు. దొంగతనం జరిగిన వైన్ షాపులు, కిరాణ దుకాణాల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ వైపు వెళ్తున్న నలుగురు యువకులను పట్టుకుని విచారించగా దొంగతనం బయట పడిందని తెలిపారు. వారివద్ద ఉన్న మోటార్ సైకిల్‌తోపాటు రూ. 2,200ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారు గతంలో తలమడుగు, జగిత్యాల పట్టణంలో దొంగతనానికి పాల్పడినట్లు విచారణలో తేలిందని పేర్కొన్నారు. ఆదివారం కూడా దొంగతనం చేయడానికి ముందస్తు రెక్కి చేసేందుకు ఉట్నూర్ వైపు వెళ్తుండగా ఇంద్రవెల్లి మండల కేంద్రంలో పట్టుబడినట్లు తెలిపారు. ఇప్పటి వరకు వీరిపై 13 కేసులు ఉన్నాయని, నలుగురు కలిసి జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. నలుగురు నిందితులను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ


